# ఓ భయాన్ని కథ

రాచకొండ
రంగనాథశర్మ

వంశగౌరవంకోసం... పరువుప్రతిష్ఠల కోసం... ఎటువంటి పనినైనా చెయ్యగల కుటుంబంలో పుట్టినవారు శ్రీ దయానంద. ఆయన ప్రఖ్యాత పారిశ్రామికవేత్త.

ఆయన పరువే తన ప్రాణంగా భావించే ఉత్తమ ఇల్లాలు పార్వతి. భార్య పార్వతంటే శ్రీ దయానందకు సర్వస్వం.

ఆవిడ ఏ విషయంలోనైనా బాధ పడుతుందంటే. ఆ బాధకు కారణాలయిన వ్యక్తుల్ని... పరిస్థితుల్ని తప్పించి ఆమెను సంతృప్తి పరచటంలో ఉన్న ఆనందం ఆయనకు చాలా విలువైనది.

ఆవిడ పదిహేను రోజుల క్రితం బొంబాయి వెళ్లింది - బొంబాయిలో ఆవిడ చెల్లెలు కల్యాణి ఉంటోంది చాలా కాలంగా కల్యాణి రమ్మని పోరుతుంటే తీరికచేసుకుని పార్వతి చెల్లెల్ని చూడటానికి బొంబాయి వెళ్లింది

వెళ్తూ... వెళ్తూ..యింటివిషయంలో భర్తను ఓసారి హెచ్చరించి మరీ వెళ్లింది.

కొడుకు శ్రీధర్ అమెరికాలో రీసెర్చి చేస్తున్నాడు.కూతురు అంజలి. తల్లి అటు బొంబాయి వెళ్లగానే స్నేహితురాళ్లతో కలిసి బెంగుళూరు వెళ్ళింది.

యీ విషయం పార్వతి కిష్టముండదు. అందే స్నేహితుల్తో తిరగటం -స్నేహం అంటూ ప్రతి మధ్యతరగతి అడదీ తన కూతుర్ని దోచుకు తింటుందేమోనని ఆవిడ భయం. మధ్యతరగతి బుద్ధు లెక్కడ కూతురుకు ఒంటబడతాయోనని కూడా ఆవిడ భయమే

కాని... అంజలి మాత్రం బయటకు వ్యక్త పరచకపోయినా తల్లికంటే

మూడాకులెక్కువే చదివింది. అహం ప్రదర్శించటం విజ్ఞతకాదనే విజ్ఞురాలు పార్వతి కూతురు అంజలి.

అందుకే అంజలి అంటే తండ్రి శ్రీ దయానందకూడా ప్రత్యేకమైన అభిమానం. యికపోతే ఝాన్సీ ఆ యింట్లో అందరికీ ప్రాణంతో సమానం. ఆ పదిహేనురోజుల్లో ఆ యింట్లో కొన్ని సంఘటనలు జరిగినట్లుగా మేనేజరు ద్వారాను, కారుడ్రైవర్ ఆంథోనీ ద్వారాను వినడమే కాకుండా, చిత్రమైన పరిస్థితుల్లో తను కళ్లారా చూడటం కూడా తటస్థించింది శ్రీ దయానందకు

అదీ ఝాన్సీ విషయంలో...

వెళ్తూ వెళ్తూ పార్వతి ప్రత్యేకంగా హెచ్చరించి మరీ వెళ్ళింది ఝాన్సీ గురించి. కూతురు అంజలి వెళ్లలేక వెళ్లలేక వెళ్ళింది.

అమెరికాలో వుండి రీసర్చి చేస్తున్న శ్రీధర్ ఝాన్సీ గురించి ప్రతి ఉత్తరం లోనూ వ్రాసి ప్రతి ఉత్తరం నుండి జవాబు ఆశిస్తాడు.

అంతగా అందరికీ కూడా ప్రాణ ప్రదమైన ఝాన్సీని...శ్రీ దయానంద యివాళ...

"ఝాన్సీ" శ్రీ దయానంద కంఠం ఖంగుమంది.

ఉత్తమ వంశానికి చెందిన నువ్వెక్కడ? పూరిగుడిసెల్లో మురికి వాడల్లో నివసించే ఆ రాజా ఎక్కడ?

నువ్వు నివసించడానికి పెద్ద పెద్ద భవంతులున్నాయ్.

నువ్వు సంచరించడానికి పూదోట లున్నాయ్.

నువ్వుషికార్లు చేయడానికి కార్లున్నాయ్.

కాలు క్రింద పెడితే కందిపోకుండా మెత్తని తివాసీలున్నాయ్... పాలు... అన్నం...బిస్కట్లు.. వెన్న ..బ్రెడ్... యింకా ఏం కావాలిస్తే అది నీకు మరు నిముషంలో అందించే నౌకర్లున్నారు. యిక రాజా; నీకున్న మదీ మార్బలం, నౌకర్లుచాకర్లు, అంతస్థు ఆడంబరాలు, ఏవున్నాయ్ ఆ రాజాకు. ఆ పేరు పెట్టు కుని మన గుమ్మంలో అడుగు పెట్టడాని కైనా అర్హతుందా ఆ రాజాకు? అసలా మొహం చూస్తేనే అసహ్యం వేస్తుందే- అలాటిది నువ్వు ఆ రాజాతో.. ఛీఛీ... ఆగి ఊపిరి పీల్చుకున్నారు శ్రీ దయానంద.

బేలగా ఆయన వంక చూస్తూంది ఝాన్సీ!

అనుక్షణం నిన్ను ఎంతో ఆప్యాయంగా, అనురాగంతో చూసు కుంటున్నామే - నీమీద మాకెన్నో ఆశలుంటాయనీ... నీ భవిష్యత్తుగురించి మేం వెన్నో కలలు కంటాంవనీ .. మా



ఆశల్ని నెరవేర్చాల్సిన బాధ్యత నీకుందనీ మర్చిపోతే ఎలా?

నీకు మేం యేం తక్కువ చేస్తున్నామని. మేం నిన్ను అభిమానిస్తూంటే దాన్ని అలుసుగా తీసుకుని యింతపని చేశావు ఝాన్సీ.. ఎందుకింత తొందరపాటుగా వ్యవహరించావు నీ అవసరాలు...నీ కోరికలు...తెల్సుకోలేనంత, తీర్చలేనంత దౌర్భాగ్యులం కాదే మేము.

నీ మంచిచెడ్డలగురించి ఆలోచించే మేం యింకా బ్రతికున్నామనైనా ఆలోచించకుండా యింత నీచానికి దిగజారిపోతావా? ఛా. ఛా. తల్చుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తూంది. నా శరీరమంతా తేళ్లూ జెర్రులూ ప్రాకుతున్నట్టుగా ఉంది. యిలా పనికిమాలిన పనిచేసిన నిన్ను యింకా యెందుకు బ్రతికుంచానా అని బాధపడుతున్నాను.

మన మేనేజరు రెండు మూడుసార్లు చూచాయగా నాతో అంటే నమ్మలేకపోయేను. పైగా యిలాంటివి చెప్పడానికి సిగ్గుండాలనీ ... కాస్తంతయినా ఆలోచించే చెప్పావా అని చివాట్లువేసాను. మళ్లీ యెప్పుడైనా యిటువంటి విషయాలు నా దృష్టికి తెస్తే ఉద్యోగమే తీసిపారేస్తానన్నా. నీగురించి చెడుగా నాతో చెప్పటానికి వాడి కెన్ని దమ్ములు. ఆ విషయం వాడితో అన్నాను, గట్టిగా మందలించి. నాలుక్కాలాల పాటు ఉద్యోగం చెయదల్చుకుంటే యిలాటివి మరెప్పుడూ నాదగ్గర వాగొద్దని వార్నింగిచ్చేను.

యిది జరిగిన రెండ్రోజులకే మన

డ్రయివర్ ఆంథోనీ కూడా అదేమాటన్నాడు. వాణ్ణి కూడా తీవ్రంగా తిట్టి పంపించాను అయితే ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు.

నిప్పులేందే పొగరాదు. యీ విషయం బయటపడితే అవ్వ ఎంత సిగ్గుచేటు వెంటనే నిన్ను కాల్చిపారేయాలను కున్నాను. నా గౌరవానికి మచ్చ తెచ్చే టట్టయితే ఎవర్నయినా క్షమించే ఓర్మి మా వంశంలోనేలేదు. పిస్టల్ తీసాను నువ్వున్న చోటికి వచ్చాను. ఆప్యాయంగా నా దగ్గర కొచ్చావ్ నాలోని కోపమంతా ఎగిరిపోయింది. ప్రశాంతంగా ఉన్న నీ మొహం చూస్తుంటే తొందరపడ్డానా అని కూడా అనిపించింది.

చెప్పుడు మాటలు విని నిన్ను దండించటం మూర్ఖత్వమే అవుతుంది కిట్టనివాళ్లెవ్వో అనుకుంటారు, అని సరిపెట్టుకున్నా.

అయితే యీ విషయం నిజం కాకూడదనీ, అలాటి చెడు నేను వినకూడదని భగవంతుణ్ణి కూడా ప్రార్థించాను.

కాని నేనే విషయం నిజం కాకూడదనుకున్నానో అదే నిజమైంది... వినకూడదనుకున్నదే కళ్లారా చూడటం జరిగింది యూన్సీ! ఈ విషయం వింటే రేపు బొంబాయినుంచి తిరిగివస్తున్న పార్వతి గుండె పగిలిపోదూ... నిన్ను వదిలి వెళ్లలేక వెళ్లలేక వెళ్ళింది. నవ్విలా చేశావని తెలిస్తే !? మైగాడ్ !

యింకో గంటలోనో అరగంటలోనో రెక్కలు గట్టుకు వచ్చే అంజలి యీ విషయం విన్న వెంటనే ఏమైపోతుంది

ప్రతి ఉత్తరంలోనూ అమెరికా నుంచి వివరాలడిగే అబ్బాయి శ్రీధర్ కేం సమాధానం వ్రాయమంటావ్. 'బాబూ శ్రీధర్. యూన్సీ చెడిపోయింది. మన అంతస్థుకు తగని ఆ రాజాతో తిరిగి మన పరువు ప్రతిష్ఠల్ని నాశనం చేసిందని, రాయనా ?

మా నమ్మకాలెందుకిలా వమ్ము చేశావు. ఎలాగైనా యీ విషయాలు పార్వతికీ, అమ్మాయికీ శ్రీధర్ కూ కూడా తెలియకూడదు

యీ సంగతి యిద్దరికే తెలుసు. మేనేజర్ కూ, డ్రైవర్ ఆంథోనీకీ.

అసలా రాజా బ్రతికుండడానికి వీల్లేదు బ్రతికుంటే నీ మూలంగా ఆ మురికి కూపంలోంచి యీ బంగళాలోకి రాకపోకలు తప్పవు అది మేము సహించేవిషయం కాదు. భరించగల్గింది అంతకంటేకాదు.

దేనికైనా అంతస్థు, హోదా కావాలి వెర్రి వ్యామోహంలోపడి నువ్వా రాజాతో...'మిజరబుల్' "అన్ బేరబుల్."

పార్వతి అసలే మొండి. పట్టుదల



హేమన్ను నీమీద అభిమానాన్ని చంపుకోవటానికైనా సిద్ధపడ్తుందేమో గాని నువ్వు చేసిన పనిని హర్షించదు... క్షమించదు

శ్రీధర్ కి విషయం తెలిస్తే వెంటనే చదువుకు స్వస్తిచెప్పి అమెరికానుంచి వచ్చేస్తాడు. వాడి అభిమానం ఎంతో ఆవేశంకూడా అంతే ఆ కోపంలో... ఆవేశంలో ఏమేం చేస్తాడో చెప్పలేను. అంజలి కి సంగతి శరాఘాతం లాంటిది ఆ లేత హృదయం ఎలా తట్టుకుంటుంది ?

నో, నో. యీ విషయాలు మనమధ్యే సమాధయిపోవాలి. యిప్పుడు నిన్ను చంపేసినా, బయటకు పంపేసినా ఎన్నో ప్రశ్నల్ని, విమర్శల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది ఆల్ రైట్ యూనీస్. యీ క్షణం నుంచి నువ్వు వీధిలోకి రావటానికి వీల్లేదు ఆ రాజాను మర్చిపో. వెళ్లు"

ప్రముఖ పారిశ్రామిక వేత్త శ్రీ దయానంద ఓరాగ్గా పచార్లు చేస్తున్నాడు.

యూనీస్ నెమ్మదిగా లోపలి కెళ్ళిపోయింది.

మేనేజర్ కూ...ఆంథోనీకి కబురు పెట్టారు శ్రీదయానంద. పదినిముషాల్లో యిద్దరూ కంగారుగా వచ్చారు. యిద్దర్నీ ఓ గదిలోకి తీసుకువెళ్ళాడు అది సౌండ్ ప్రూఫ్ గది.

మేనేజర్..

ఆంథోనీ

యిప్పుడు మీరు చేస్తున్న ఉద్యోగాలు మీకుటుంబ పోషణకు ఎంతో ముఖ్యం కదూ.

'యెస్ సర్' యిద్దరూ ఒకేసారి అన్నారు.

"యీ క్షణంలో మిమ్మల్నిద్దర్నీ ఉద్యోగాల్లోంచి డిస్మిస్..."

"సార్" మాట పూర్తవకుండానే యిద్దరూ అన్నారు.

"చేస్తే. మీరు చాలా యిబ్బందులు పడాల్సి వస్తుంది ఔనా."

"ఔన్సార్."

అందుకే యీ యింట్లో యేలాంటి సంఘటనలు జరిగినా మీరు అక్కడికక్కడే మర్చిపోవాలి. చూడనట్లే నటించాలి. ఎక్కడా అనకూడదు... పెదవి దాటిందా. మీ నోటిముందు 'కూడు' ఆ మరుక్షణంలో నేపడిపోతుంది.

అదే... "ఝాన్సీ గురించి.." ఆగి యిద్దరి ముఖాల్లోకి చూశాడు.

"యెస్సర్ ... ఎక్కడా అనం. వాగం. అసలు మాకేం తెలియదు. మా గొడ వేదో మాది తప్పితే...

"దట్సాల్‌రైట్. నౌ యు కెన్ గో."

"యెస్సర్." ముఖాలకు పట్టిన చెమటను తుడుచుకుంటూ మేనేజర్, ఆంథోనీ ... నెమ్మదిగా జారుకున్నారు. వాళ్లు బయటకు వెళ్ళిన వెంటనే ఫోన్ తీసారు శ్రీ దయానంద.

"హల్లో...ఆ నేనూ దయానంద... కమిషనర్‌గారూ. యెస్. కచ్చితంగా, తప్పకుండా చేస్తాను. మీరుమాత్రం రాజాని...అలాగే నా విషయం తెల్సు కదా! యిందులో యేమాత్రం తేడా పాడా లుండకూడదు. ఆపైన మీ యిష్టం... లేకపోతే..."

"మాట్లాడమంటారా. సరే మీ లెవెల్లో పూర్తిచేస్తే నాకంతకంటె కావల్సిందేముంది. ఓ కే ఉంటాను" ఫోన్ పెట్టేశారు శ్రీ దయానంద.

తెల్లవారుతుండగానే

శ్రీ దయానందగారి బంగళాకు అతి చేరువలో ఉన్న ఒక మురికిపేటలోని గుడిసెముందున్న 'రాజా' అనే కుక్కను మునిసిపల్ కమిషనర్‌గారి ప్రత్యక్ష పర్యవేక్షణలో మ్యునిసిపాలిటీ వారి కుక్కల బండిలో తరలించటం జరిగింది.

అలవాటు ప్రకారం లేస్తూనే "ఝాన్సీ" అని కేకవేశారు శ్రీ దయానంద.

తెల్లటి...

అందమైన...

ఝాన్సీ తోక ఆడించుకుంటూ దయానందగారి దగ్గరకెళ్ళింది.

("ఝాన్సీ"కి మాట్లాడటం వస్తే రెండువిషయాలు చెప్పగలిగేది ఒకటి అంజలి హైక్లాసు సొసైటీలో విచ్చలవిడిగా తిరిగిన ఫలితంగా సంభవించిన ఓ "మచ్చ"ను లీగలైజ్‌డు అబార్షన్ ద్వారా తొలగించుకోవటానికి బెంగుళూరు వెళ్ళిందనీ, రెండు - లేచిపోయిన కల్యాణి దగాపడితే దగ్గరుండి తీసుకురావటానికి పార్వతి బొంబాయి వెళ్లిందనీ)